## క్లుప్తంగా

### వాసవీ మాతకు 180 వంటకాలతో సారె



వాసవీ మాతకు 108 రకాల పిండి వంటలతో సమర్పించిన సారె

**కొవ్వూరు:** శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీమాతకు విశేష పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మ వారికి 180 రకాల పిండి వంటకాలతో సారె సమర్పించారు. ఆర్యవైశ్య మహిళలు సామూహిక వరలక్ష్మీ వత్రాలు నిర్వహించారు. సంఘాధ్యక్షుడు మద్దుల సోమరాజు, కార్యదర్శి నాళం వీర వెంకట శ్రీనివా సరావు, మద్దుల సత్యనారాయణ, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.అనంతరం గ్రామదేవత కొవ్వూరమ్మకు నైవేద్యం సమర్పించారు.భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### వినాయక ఆలయంలో నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ

**చాగల్లు:** మార్కొండపాడు శివారు గరప్పాడులోని వినాయక ఆలయంలో నూతన విగ్రహాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యహావచనం, పంచగవ్య నవగ్రహ పూజ, వాస్తు పూజ, మహాశాంతి హోమం వంటి పూజలను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

### సీసీ రోడ్డు, డ్రైన్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

**నిడదవోలు:** పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు మున్సిపల్ పాలకవర్గం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షల వ్యయంతో స్థానిక 4వ వార్డులో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైన్‌లకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, గోపిరెడ్డి శ్రీనివాస్, కర్రి మూర్తి, కొత్తూరి శ్రీధర్, దురుపుడి వాసు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలకు నూరు శాతం పని దినాలు

**గోపాలపురం:** ఉపాధి హామీ కూలీలకు జిల్లాలో నూరు శాతం పని దినాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు డ్వామా పీడీ పి. జగదాంబ చెప్పారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం ఆమె ఉపాధి క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో 58 లక్షల పని దినాల లక్ష్యానికి గాను ఇప్పటికే 37.85 లక్షల పని దినాలను పూర్తి చేశామన్నారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు మామిడి, జీడిమామిడి రైతులను గుర్తించి 300 ఎకరాల సాగు పనులు చేపట్టినట్టు చెప్పారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు దారుల బ్యాంకు అకౌంటుకు ఆధార్‌తో అనుసంధానం చేయాలని సిబ్బందికి సూచించారు. ఏపీఎం కె వెంకట్రావు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**నిడదవోలు రూరల్:** మండల పరిషత్ సాధారణ నిధులు కేటాయించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. కోరుపల్లి గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించి సచివాలయం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా జగనన్న గోరుముద్ద మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఏజన్సీ నిర్వాహకులకు సూచించారు. గ్రామంలో నిర్మాణంలో భవనాలను త్వరగా పూర్తిచేయాలని, సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు ఆత్రేయపురపు రాజారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా ఏకలవ్య ఉత్సవాలు

**దేవరపల్లి:** ఏకలవ్య ఉత్సవాలను మండల ఏకలవ్య యుజవన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద గల సామాజిక భవనంలో ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుడి విగ్రహానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) పలువురు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏకలవ్య కమ్యూనిటీ భవనానికి ప్రహరీ నిర్మించాలని యువజన సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరారు. నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, దేవరకొండ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరాలిచ్చే తల్లికి ప్రణమిల్లి..

- కోటసత్తెమ్మ సన్నిధిలో 950 మంది మహిళల వరలక్ష్మీ వ్రతాలు
- ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో 1,200 మందికి పైగా ముత్తైదువలు..
- సామూహిక కుంకుమ పూజలు
- ఏర్పాట్లు చేసిన అధికారులు



కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు



ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు



చాగల్లులోని ధనలక్ష్మి అమ్మవారి అలంకారం

**నిడదవోలు రూరల్:** 'వరాలిచ్చి చల్లగా కాపాడు తల్లీ' అంటూ మహిళలు ప్రణమిల్లి మొక్కారు. తమ మాంగల్యాన్ని కాపాడాలంటూ వేడుకున్నారు. శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ఆవరణలో నిర్వహించిన శ్రావణ లక్ష్మి, ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. సామూహిక కుంకుమార్చనకు విచ్చేసిన సుమారు 950 మంది ముత్తైదువులకు దేవస్థానం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, గాజులు, తమలపాకులు, అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ), ధర్మకర్తల మండలి చైర్మన్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ఆలయ ప్రధానార్చకుడు ఎస్‌వీకే అప్పారావు శర్మ పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, ఉర్ల వీరవెంకటలక్ష్మి, వద్దిరెడ్డి మహాలక్ష్మి, ఎస్.భవాని, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**శ్రీవారి క్షేత్రంలో..**

**ద్వారకాతిరుమల:** శ్రీవారి క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నేత్ర పర్వంగా జరిగాయి. ఆలయ అనివెట్టి మండపంలో దేవస్థానం నిర్వహించిన ఈ వ్రత వేడుకలో 1200 మందికి పైగా మహిళలు పాల్గొని, వరలక్ష్మీ దేవిని కొలిచారు. తొలుత విశేషంగా అలంకరించిన అమ్మవారిని అనివెట్టి మండపం వద్ద వేదిక ప్రతిష్ఠింపజేశారు. అర్చకులు, పండితులు అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు సతీమణి భాగ్యలక్ష్మి అమ్మవారికి పూలు, పండ్లు అందజేయగా, వ్రత వేడుక ప్రారంభించారు. అర్చకులు, పండితులు, పురోహితులు, ఆగమ విద్యార్థులు శాస్త్రోకంగా ఈ వ్రత వేడుక జరిపించారు. శ్రీవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చిన మహిళా భక్తులు కూడా ఈ వ్రతాన్ని ఆచరించారు. ఇందులో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, అలాగే రవికలు, ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు.

**విశేష అలంకారాల్లో దేవతామూర్తులు**

**ఉండ్రాజవరం:** శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కొలువైన దేవతామూర్తులు విశేష అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పాలంగి, ఉండ్రాజవరం, మోర్త గ్రామాల్లోని కనకదుర్గమ్మ వార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో ఉండ్రాజవరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం తరఫున గ్రామదేవత ముత్యాలమ్మ వారికి గ్రామ భక్తులందరూ చీర, చలివిడి, పానకాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**చాగల్లు:** స్థానిక వల్లికుంటలోని కనకదుర్గమ్మ ఆలయంలోను, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరం తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. లలితా సహస్ర, విష్ణు సహస్ర నామాలు, భగవద్గీత పారాయణం, సామూహిక కుంకుమ పూజలు చేశారు. బ్రాహ్మణగూడెం, చాగల్లు కనక దుర్గమ్మ ఆలయాల్లో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాసం ముగింపును పురస్కరించుకుని చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని ధనలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విశేష అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారుమూరి గున్నేశ్వరరావు గుప్త, సభ్యులు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పథకాలకు అర్హతే ప్రామాణికం

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 22వ వార్డులో గడప గడపకూ..



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత



లింగంపల్లి వాసులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

**కొవ్వూరు:** అర్హులందరికీ నూరు శాతం సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. 132వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి వనిత శుక్రవారం పట్టణంలోని 22వ వార్డులో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన మేలు గురించి వివరించారు. ఎలాంటి వివక్షతా లేకుండా పార్టీ రహితంగా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదే అన్నారు. 22వ వార్డుతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయితే పట్టణంలో నూరుశాతం పూర్తవుతుంది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభొట్టి గంగాధర శ్రీనివాస్, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు నగ్గలపాటి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారా యణ, కాకర్ల వెంకటేశ్వరరావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, నాయకులు దేవగుప్తాపు లక్ష్మణరావు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పోసిన శ్రీకృష్ణ దేవ రాయులు, తోట రామకృష్ణ, పొన్నాడ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న మేలును మరిచిపోవద్దు**

**నిడదవోలు:** గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని 23వ వార్డు లింగంపల్లిలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారు పొందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. లింగంపల్లి ప్రాంత సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉదారంగా మేలు చేయాలనే దృఢ సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మీరంతా జగనన్నకు మరోసారి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, కౌన్సిలర్లు మద్దిపాటి నాగశ్రీ , కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పెండ్యాల గ్రామంలో..**

**నిడదవోలు రూరల్:** ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం ఐదో రోజు మండలంలోని పెండ్యాల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఆ పంచాయతీ సర్పంచ్ కారింకి అన్నవరం, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో నాలుగున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైర్రాజు సత్యరాజు, నాయుడు సత్యనారాయణ, పేరిచర్ల నాగరాజు, వాకా సూర్యనారాయణ, సరిపల్లి నూకరాజు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# చంద్రబాబు అవినీతిపై నోరు మెదపరేం?

- వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు జీవీ
- ఎమ్మెల్యే తలారితో కలసి మీడియా సమావేశం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జీవీ

**ద్వారకాతిరుమల:** మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడికి ఆదాయపు పన్ను శాఖ జారీ చేసిన షోకాజ్ నోటీసులపై ఆయన సొంత పుత్రుడు లోకేష్ గానీ, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ గానీ నోరు మెదపకపోవడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) ఎద్దేవా చేశారు. ఆయన శుక్రవారం ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు రూ.118 కోట్ల ప్రజా ధనాన్ని నేరుగా నొక్కేసినట్టు ఆధారాలతో సహా బట్టబయలైందన్నారు. 2019లో అమరావతిలో రూ.7 వేల కోట్ల విలువైన రాజధాని భవన నిర్మాణ పనులను షాపూర్జీ పల్లోంజీ కంపెనీకి ఫర్ ఎస్ఎఫ్‌టీని రూ.1900 రూ.రెండు వేలకు చంద్రబాబు ఇచ్చారు. ఇలా ఇచ్చిన సొమ్ములో రూ.118 కోట్లను ముడుపులుగా చంద్రబాబు ఆ కంపెనీ నుంచి నేరుగా అందుకున్నట్టు సాక్ష్యాధారాలతో సహా రుజువైందన్నారు. దీనిపై వారం రోజులుగా రాద్ధాంతం జరుగుతున్నా చంద్రబాబు, యువగళం పేరుతో వాకింగ్ యాత్ర చేస్తున్న లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, ఈనాడు, ఆంధ్రజ్యోతిలు స్పందించక పోవడం దారుణమన్నారు.చంద్రబాబుకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీ కాదని, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ అని జీవీ అన్నారు. పేదలకు మేలు చేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అనుక్షణం బురద చిమ్మే వారంతా, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. 2012 అక్టోబర్ నుంచి, 2023 జూన్ వరకూ చంద్రబాబుకు ఐటీ శాఖ నాలుగు సార్లు సమన్లు ఇచ్చిందని, వాటికి చంద్రబాబు ఇచ్చిన వివరణ పొంతన లేకుండా ఉన్నట్టు ఆ శాఖ తేల్చిందన్నారు. డైరెక్టుగా రూ.118 కోట్లు చంద్రబాబుకు అందినవేనని నిర్ధారించిన తరువాతే ఆయనకు షోకాజ్ నోటీసులు అందించారన్నారు. ఇంత రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినా ఏమాత్రం సిగ్గు లేకుండా చంద్రబాబు ప్రజల్లో తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. అమరావతి ఒక ల్యాండ్ పూలింగ్ స్కామ్ అని, కొన్ని రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని బాబు దుర్వినియోగం చేశారని జీవీ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయాన్ని ముందే గమనించారని, అందుకే రివర్స్ టెండరింగ్ ద్వారా ఎస్ఎఫ్‌టీని రూ.1300 కు ఇచ్చారన్నారు. వీటిని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. మీడియా సమావేశంలో మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**ద్వారకాతిరుమల:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అంతా కలసికట్టుగా పనిచేద్దామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి, నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి తన ప్రసంగంలో పార్టీ నాయకుల, ప్రతి కార్యకర్త సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఏవైనా చిన్నపాటి విభేదాలుంటే పక్కనబెట్టి అంతా కలసి మెలసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. వీటితో పాటు అమ్మఒడి, విద్యాదీవెన, మహిళలకు సున్నా వీడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. జీవీ మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నా.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో నిరుపేదలకు ఒక్క సంక్షేమ పథకం కూడా అందలేదని, కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే అందేవని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, వైస్ ఎంపీపీ ఓగిరాల చంద్ర, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, బొండాడ వెంకన్నబాబు, మానుకొండ సుబ్బారావు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



కొవ్వూరులో పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి

**కొవ్వూరు:** గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్న కుమారి అన్నారు. పట్టణ రెండో సెక్టార్ పరిధిలోని 23వ వార్డులో శుక్రవారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పోషకాహార లోపాలున్న తల్లులను గుర్తించి పోషకాహార కిట్లు అందజేస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ చెప్పారు. సూపర్‌వైజర్ బి.ఉదయభాను, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు. పోషకాహారం ప్రదర్శన ఏర్పాటు చేశారు.

**నల్లజర్లలో..**

**నల్లజర్ల:** ఐసీడీఎస్ నల్లజర్ల కార్యాలయంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. అనంతరం తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన వంటలు, చిరుధాన్యాల గురించి ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, పీహెచ్‌సీ డాక్టరు సిరాజుద్దీన్ ,వైద్య, ఆరోగ్యసిబ్బంది, సూపర్ వైజర్లు వెంకటలక్ష్మి, కృష్ణవేణి, హారతి పాల్గొన్నారు.

# ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ..

- యువకుడి మృతి
- ఒకరికి తీవ్ర, ముగ్గురికి స్వల్ప గాయాలు



ఉండ్రాజవరంలో ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలు

**ఉండ్రాజవరం:** స్థానిక ఉన్నత పాఠశాల వద్ద గురువారం అర్ధరాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఒక వ్యక్తి తీవ్రంగాను , మరో ముగ్గురు స్వల్పంగాను గాయపడ్డారు. ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉండ్రాజవరానికి చెందిన ఎం.సందీప్ కుమార్ తన స్నేహితులైన ఎస్‌కే రసూల్, ఎ.రాజు, అనిల్‌తో కలసి డ్యూక్ మోటార్ సైకిల్‌పై (ఒకే టూ వీలర్‌పై నలుగురు) రేలంగి నుంచి స్వగ్రామం వస్తున్నారు. ఉండ్రాజవరానికే చెందిన ఎస్.వెంకటేష్ తన పల్సర్ బైక్‌పై తణుకు వెళుతున్నారు. ఉన్నత పాఠశాల వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా వేగంగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో డ్యూక్ బైక్ నడుపుతున్న సందీప్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్యూక్ బైక్‌పై ఉన్న రాజుకు తీవ్ర గాయాలవగా, రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడ్డారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## గోపాలపురంలో అక్రమ మద్యం సీజ్

**గోపాలపురం:** భారీ ఎత్తున కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శుక్రవారం గోపాలపురం పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అలాగే గోపాలపురంలోని పెద్దగూడెంలో ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం రేట్లు ఎక్కువగా ఉండడంతో అక్రమార్కులు యానాం, తెలంగాణాల నుంచి మద్యాన్ని దొడ్డి దారుల్లో ఏపీకి తరలిస్తూ సొమ్ములు చేసుకుంటున్న తెలుస్తోంది.

## బైపాస్ రోడ్డులో త్రుటిలో తప్పిన ప్రమాదం

**గోపాలపురం:** స్థానిక బైపాస్ రోడ్డులో శుక్రవారం ఘోర ప్రమాదం తప్పింది. ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించేందుకు లారీ డివైడర్‌పైకి దూసుకువెళ్లింది. వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న లారీ దేవరపల్లి నుంచి కొయ్యలగూడెం వెళుతున్న లారీ ఎదురుగా వచ్చాయి. దాంతో కొయ్యలగూడెం నుంచి వస్తున్న లారీ డ్రైవర్ అప్రమత్తమై లారీని వెంటనే డివైడర్‌పైకి ఎక్కించాడు. లేకపోతే పెద్ద ప్రమాదం జరిగేది.

## ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ పోటీలు

**పెరవలి:** రెండు రోజుల పాటు ఖండవల్లి ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని 7 ఉన్నత పాఠశాలల నుంచి బాలురు ఈ పోటీలకు హాజరయ్యారని ఫిజికల్ డైరెక్టర్ పుల్లపురాజు తెలిపారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్, చెస్ తదితర పోటీలు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 14,15,16 తేదీల్లో నిడదవోలు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

**నల్లజర్ల:** స్థానిక జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు నీరుకొండ జయకృష్ణ పోటీలను ప్రారంభించారు.అండర్-14, అండర్-17 విభాగాలలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు ఏర్పాటు చేసారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ విభాగాల్లో పోటీలు జరిగాయి. 6 పాఠశాలల నుంచి జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

**తాళ్లపూడి:** గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం రెండో రోజు మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. అండర్ 17 విభాగంలో విద్యార్థులకు ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.